ప్రజాశక్తి

ఆదివారం 1 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విఎంఆర్‌డిఎ భూ అమ్మకాలకు స్పందన తగ్గిందా ?

- ద్రవ్యోల్బణ, ఆర్థిక సంక్షోభ పరిస్థితుల ప్రభావం ఎంత?
- 'మధురవాడ హైట్స్'పై అధికార అంచనాలు మారనున్నాయా ?
- విశాఖలో తాజా అంశాలపై పలు వాదనలు



మధురవాడ హైట్స్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రస్తుతం భూముల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలు ఆశాజనకంగా సాగడం లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అమ్మేవారున్నా కొనేవారు కరువౌతుండడం వెనక గల ప్రధాన కారణం ఆర్థిక సంక్షోభ ఛాయలని తెలుస్తోంది. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) గతంలో యాంబియన్స్ ప్రైవేట్ సంస్థ నుంచి స్వాధీనం చేసుకున్న 87.8 ఎకరాల మధురవాడలోని ల్యాండ్ పార్శిల్‌ను తాజాగా 'మధురవాడ హైట్స్' పేర వేలానికి పెట్టింది. ఈ నెల 27ను ఆఖరు తేదీగా నిర్ణయించిన విషయం కూడా తెలిసిందే. యాంబియెన్స్ సంస్థకు సుమారు రూ.100 కోట్లు చెల్లించిన విఎంఆర్‌డిఎ తాజాగా బిడ్డింగ్‌కు దిగడం మంచి పరిణామమేగానీ ఒక్క కొనుగోలుదారూ ముందుకు రాలేదు. విఎంఆర్‌డిఎ ఇక్కడి మధురవాడ సర్వే నెంబర్ 421 (పాత సర్వే నెంబర్ 207)లోని ఈ భూములను 14 బల్క్ ల్యాండ్ పార్శిల్‌గా విభజించి 80 అడుగుల రోడ్లను నేషనల్ హైవేకు కనెక్ట్ చేస్తూ సౌకర్యాలను కల్పించింది. కానీ ఒక్కరూ రాలేదు. ఈ ఏడాది దసరా పండగ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో క్యాంప్ ఆఫీసు ఏర్పాటు చేసుకుని పాలన చేస్తారన్న సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్నా భూముల కొనుగోలుకు ముందుకు రాలేదంటే 'బిజినెస్ వాతావరణం లేదా?', రాజధాని వస్తుందో లేదోనన్న సందేహమా ? 2024 ఎన్నికల్లో ఈ ప్రభుత్వం మారిపోతే పరిస్థితి తారుమారవుతుందన్న ఆందోళనా ? దీంట్లో ఏది నిజమని ఆరా తీస్తే ఇవన్నీ పైకి చెప్పుకోడానికి కనిపించే కారణాలు మాత్రమే తప్ప వాస్తవ ఆర్థిక పరిస్థితులు అననుకూలంగా ఉన్నాయన్నది నిశితంగా పరిశీలిస్తే వెల్లడవుతోంది. చదరపు గజం రూ.30 వేలుగా విఎంఆర్‌డిఎ ఇక్కడ నిర్ణయించింది. సుమారు రూ.1100 కోట్లు ఆదాయం విఎంఆర్‌డిఎకు దీన్నుంచి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా అంతా 'వైట్ మనీ' కావడం కూడా ఎవ్వరూ ముందుకు రాలేదన్న వాదన లేకపోలేదు. చేతిలో డబ్బు లేకుండా, రాజకీయ అనిశ్చితి కూడా ఉన్నచోట్ల 'బిల్డర్'లు రిస్క్ తీసుకుంటారా ? అంటే ససేమిరా అని చెప్పొచ్చు. 2024 ఎన్నికల్లో గెలుపోటములను బట్టి ముందుకెళ్లడం మంచిదనే అభిప్రాయం బిల్డర్లలో ఉందని క్రెడాయ్‌కు చెందిన ఓ ప్రతినిధి 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.

ఎన్‌ఆర్‌ఐలే ఈ ప్రాంతంలో ప్రధాన ఇన్వెస్టర్లు!

ప్రపంచ పరిస్థితుల ప్రభావం నగరంపై లేకపోలేదు. అత్యధికంగా భూములు కొనుగోలు చేసే వారిలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కూడా ఎక్కువే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన మిగతా 2లో..

కోచ్ రెస్టారెంట్ ప్రారంభంలో మంత్రి దర్శన జర్దోష్ తదితరులు

ఘనంగా కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విశాఖ ఫుడ్ ఎక్స్‌ప్రెస్ కోచ్ రెస్టారెంట్‌ను కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మ నిర్భర భారత్ కింద వాల్తేరు డివిజన్‌లో 17 స్టేషన్లను ఆదర్శ స్టేషన్లుగా తీర్చుదిద్దుతున్నామన్నారు. కార్తీక్ ఫుడ్ వరల్డ్ అధినేత కె.వంశీ మాట్లాడుతూ రైలు కోచ్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే వారు అందజేసినట్టు తెలిపారు. విభిన్న రీతిలో రెస్టారెంట్ ఉండాలన్న ఆలోచనతో దీన్ని తీర్చిదిద్దామన్నారు. ఇక్కడ చైనీస్, దక్షిణ భారత దేశ అన్ని రకాల వంటకాలూ అందుబాటులో ఉంటాయన్నారు. 24 గంటలూ ఆహారం అందుబాటులో ఉంటుందన్నారు. రెస్టారెంట్ కోసం రూ.72 లక్షలు ఖర్చు చేసామని, ఈ కోచ్ రెస్టారెంట్ 72 సీటింగ్ సామర్థ్యం కలిగి ఉందని అన్నారు. అందుబాటు ధరలలో భోజనం, అల్పాహారం, స్నాక్స్ ఉంటాయన్నారు.

పలు అంశాలపై మంత్రి సమీక్ష

శనివారం ఉదయం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ విశాఖపట్నం స్టేషన్‌లో పర్యటించారు. స్టేషన్‌లో పునరాభివృద్ధి కార్యకలాపాలు, ఇతర మౌలిక సదుపాయాల తీరుపై సమీక్షించారు. విశాఖ స్టేషన్‌లో, డివిజన్‌లో జరుగుతున్న పలు కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఏటికొప్పాక బొమ్మలు విక్రయిస్తున్న వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను సందర్శించి విక్రేతతో సంభాషించారు. రైల్వే శాఖ నుంచి అమ్మకాలు, అధికారుల సహకారం మిగతా 2లో..

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం

వార్త 5లో..

ఎంఎస్.స్వామినాథన్‌కు ఘన నివాళి

వార్త 5లో..

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

వార్త 6లో..

విశాఖ నగరంలో కంచం మోగిస్తూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

హోరెత్తిన టిడిపి నిరసనలు

కంచాలు మోగిస్తూ, ఈలలు వేస్తూ ఆందోళనలు

వార్త 7లో..

ఉక్కుపై తాడోపేడో తేల్చుకుంటాం

- ప్రైవేటీకరణ కాదని ప్రధాని, కేబినెట్ ప్రకటించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- 11వ రోజుకు ఉక్కు రక్షణ యాత్ర
- అడుగడుగునా ఆదరణ .. అంతటా అనూహ్యస్పందన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్, సీతమ్మధార, ఎంవిపి.కాలనీ విలేకరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటుపరం కాదని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు చెప్పడం కాదని, స్వయంగా ప్రధాని మోడీ, కేంద్ర కేబినెట్‌నే ఆ ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత నెల 20న విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై ఉత్తరాంధ్ర అంతటా సాగిన ఉక్కు రక్షణ యాత్ర 11వ రోజుకు చేరింది. శనివారం ఈ యాత్ర అక్కయ్యపాలెం, ఎఎస్ఆర్.నగర్, గురుద్వారా, సీతంపేట, బివికె సెంటర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎవిఎన్ కళాశాల, కోడి పందాలవీధి, పూర్ణామార్కెట్, సిరిపురం, సత్యం జంక్షన్, ఈనాడు, సీతమ్మధార, హెచ్‌బి కాలనీ, కృష్ణా కాలేజీ, ఇసుకతోట, మిగతా 2లో..

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న లోకనాథం

మొదటి పేజీ తరువాయి..

యాత్రా బృందానికి ఘన స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ఉక్కుపై తాడోపేడో తేల్చుకుంటాం

వెంకోజీపాలెం, ఎంవిపి.కాలనీ, ఉషోదయ, పెదవాల్తేరు, సిబిఐ జంక్షన్ మీదుగా మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయం వరకూ సాగింది. పలుచోట్ల జరిగిన సభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేతల ప్రసంగాలు వారిలో చైతన్యం నింపాయి. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదం హోరెత్తింది. యాత్ర కొనసాగిన ప్రతిచోటా జనం నుంచి పూలవర్షం కురిసింది. సిపిఎం చేస్తున్న పోరాటానికి పలువురు మద్దతు తెలిపారు. నగరంలోని కోడి పందాలవీధి (రెల్లివీధి), ఎవిఎన్.కాలేజీ, పూర్ణా మార్కెట్‌లలో పేదలు పెద్ద సంఖ్యలో హాజరై యాత్ర చేపట్టిన వారిని అభినందించారు. యాత్రా బృందం సభ్యులు విశాఖ ఉక్కు అనగానే రెల్లివీధి యువత గొంతు కలుపుతూ 'ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు.

పిడికిలెత్తి విశాఖ ఉక్కుకు జై కొట్టిన విద్యార్థులు

శనివారం మధ్యాహ్నం ఎవిఎన్ కాలేజీలోగల వృత్తివిద్యా విభాగం, ఇంటర్, పాలిటెక్నిక్ కాలేజీల్లో బైక్ యాత్ర చేపట్టిన సిపిఎం శ్రేణులు విడివిడిగా విద్యార్థులతో ఇంటరాక్షన్‌లో పాల్గొన్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రైవేటీకరణ విధానం నుంచి కాపాడుకోలేకపోతే భవిష్యత్ ఎలా అంధకారమవుతుందో వివరించడంతో విద్యార్థినీ, విద్యార్థులంతా ఒక్కసారిగా 'విశాఖ ఉక్కు రక్షణ' నినాదాలు చేశారు. కాలేజీలో పాఠాలు చెప్పే మహిళా లెక్చరర్ ఒకరు విద్యార్థులకు ప్రభుత్వ రంగ సంస్థల గొప్పతనం గురించి చెబుతూ ...దేశంలో చాలా ప్రభుత్వ రంగ పరిశ్రమలున్నాయి. వాటన్నిటికీ ప్రమాదం ఏర్పడింది. ప్రైవేటీకరణ జరిగితే మీకెవరికీ ఉద్యోగాలు కష్టం. అలా జరగకుండా ఉండాలని సిపిఎం నాయకులు ఉత్తరాంధ్రలో ఊరూరా తిరిగి చెబుతున్నారు' అని అనగానే విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. మద్దిలపాలెం జోన్‌లో కొనసాగిన యాత్రకు అపూర్వ స్పందన లభించింది. సిఎంఆర్ సెంట్రల్ తోపుడు బండ్ల జంక్షన్ వద్ద పూలు జల్లి స్వాగతం పలికారు.

యాత్ర కొనసాగిన పలుచోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. తాము చేపట్టిన ఉక్కు రక్షణ యాత్రకు అన్ని వైపుల నుంచీ మంచి నైతిక మద్దతు లభించిందన్నారు. ఈ స్పందనను పక్కదోవ పట్టించడానికి బిజెపి ఎంపీ జివిఎల్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలలో వలే అన్ని పార్టీలు ఆంధ్రాలోనూ ఐక్యంగా కలిసి ముందుకొచ్చి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ కాకుండా ఆపాలన్నారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే ప్రజలు ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే విద్యార్థులకు, యువతకు ఉద్యోగాల కొరత ఏర్పడుతుందన్నారు. యాత్రలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, నాయకులు యుఎస్ఎన్.రాజు, వి.కృష్ణారావు, పి.మణి, డాక్టర్ జి.ప్రియాంక, ఎల్‌జె.నాయుడు, కుమార్, గౌరీష్, అప్పలరాజు, ప్రకాష్, లక్ష్మీపతి, గణేష్, కోదండ పాల్గొన్నారు.

స్పందన తగ్గిందా ?

పనిలేదు. ప్రపంచంలో వాస్తవ ద్రవ్యోల్బణ పరిస్థితులు చూస్తే అంతకంతకూ దారుణంగా ఉంటున్నాయి. విదేశాల నుంచి వచ్చి ఇక్కడ భూములు కొనుక్కొని అలా పెట్టుకుని మరలా విదేశాలకు వెళ్లిపోవడం అన్నది పాత పద్ధతి. పలు దేశాలు ముఖ్యంగా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి నెట్టబడుతున్నాయి. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రధానమైన పరిణామం ప్రపంచంలో ఒకవైపు కార్మిక ఉత్పాదకత పెరుగుతున్నా నిజవేతనాలు పడిపోతున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం ప్రపంచ వ్యాప్తంగా 2023లో ఆరు శాతానికి చేరుతుందన్న అంచనా ఉంది. అమెరికా బ్యాంకుల్లో క్రెడిట్ ఇండికేటర్స్ (సూచీలు) కుప్పకూలిపోయాయి. ముఖ్యంగా ఐటి దిగ్గజ సంస్థలైన ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలు సహా పలు ఐటి కంపెనీల గ్రోత్ రేట్ 2 నుంచి 5 శాతం ఈ ఆర్థిక సంవత్సరంలో పడిపోయిందన్నది తాజా లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆర్థిక సంక్షోభం, ద్రవ్యోల్బణ ప్రభావాలు కూడా భూముల కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నవారిపై ప్రభావం చూపుతున్నాయి.

ఘనంగా
కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లోని సఫాయి కర్మచారులతో కలిసి స్వచ్ఛతా అభియాన్ - ప్లాస్టిక్ క్యాంపెయిన్‌లో పాల్గొని ఆరోగ్య కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలో అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో విశాఖ ఒకటన్నారు. మంత్రి వెంట డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఉన్నారు.

అభివృద్ధి డ్రామా.. ఎన్నికల హంగామా !!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'జాప్యానికి ప్రమాదకరమైన ముగింపులున్నాయి' అంటాడు ప్రపంచ ప్రసిద్ధ రచయిత షేక్స్‌పియర్, అలాగే మరో రచయిత ఎడ్వర్డ్ యంగ్ మాటల్లో చెప్పాలంటే 'జాప్యం కాలాన్ని దొంగిలిస్తుంది'. ఎప్పుడు ఏం జరగాలో అది జరిగిపోవాలి అన్నదే వీటి సారాంశం. నాలుగేళ్లు తీరిగ్గా కూర్చొన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు 2024 ఎన్నికలు ఇంకా కొద్ది నెలల్లో ఉన్నాయనగా విశాఖ ప్రాంతంలో పలు ప్రాజెక్టుల గురించి తాజాగా ఊదరగొడుతుండడంతో ప్రజల్లో ఇదే చర్చ సాగుతోంది. మెట్రో రైలుకు ఒక్కపైసానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదిలించలేదు. ఈ జనవరికి తొలి కారిడార్ పనులకు భూమి పూజని చెబుతున్నారు. 2024 ఎన్నికలకు ఇంకా నెలలే వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం దసరాకు విశాఖలో కొలువుదీరి ఇక్కడి నుంచే ఎపి పాలన అంటూ వైసిపి నేతలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. నగరంలోని ప్రధాన ప్రాజెక్టులైన కాపులుప్పాడలోని సిగ్నేచర్ టవర్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, నేషనల్ హిస్టరీ మ్యూజియం, కైలాసగిరిపై సైన్స్ సిటీ, వుడా పార్కు ఆవరణలో ఓసెన్ డెక్ పార్క్, భీమిలిలో వాటర్ ప్రాజెక్టు పనుల పరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అకస్మికంగా విశాఖ విచ్చేసి ఇక్కడి అధికార యంత్రాంగాన్ని పరుగులు తీయిస్తున్నారు. వాస్తవానికి ప్రపంచంలో ఎక్కడా జరగనిది విశాఖలో జరిగిపోతుందా ? అనతి కాలంలోనే ఈ అభివృద్ధి ప్రాజెక్టులను నిర్మించడం సాధ్యమా ? అనే ప్రశ్నలు ప్రజానీకం నుంచి నేడు ఉదయిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో కొంచెమైనా వీటికి పునాదిరాయి పడి పనులు ప్రారంభించి ఉంటే ఒకటో రెండో ప్రాజెక్టులు 2024 సంక్రాంతినాటికైనా మొదలై ఉండేవి. విశాఖ నగర ప్రాజెక్టులు నాలుగు కూడా ఆరు నెలల్లో అధికారుల మాటల్లో చెప్పాలంటే మార్చి నాటికి పూర్తయిపోనున్నాయి. కానీ ఆచరణలో సాధ్యమా ?

గత పాలకుల చెప్పుల్లోనే కాలు

గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019లో సాధారణ ఎన్నికలనగా 2018లో మెట్రో కూత విశాఖలో త్వరలో వినబడనుందంటూ గళమెత్తారు. జగన్ అధికారంలోకి వచ్చారు. 2024 ఎన్నికలు ఇంకా ఆరు నెలలున్నాయనగా మెట్రో రైలు, విశాఖ నగర ప్రాజెక్టులపై హైపిచ్ వినిపిస్తున్నారు. దసరాకు క్యాంప్ కార్యాలయం అన్నమాట వైవి సుబ్బారెడ్డి లాంటి కీలక నేతలేకాకుండా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కూడా వెల్లడించడం చూస్తే పరిపాలనా రాజధాని వచ్చేసిందన్న భ్రమలు కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారన్నది ప్రజానీకంలో చర్చ మొదలైంది. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రి ఇక్కడకొస్తే అన్ని సమస్యలూ పరిష్కారం అయిపోతాయన్న భ్రమలు గొల్పుతున్నారు. క్యాంపు కార్యాలయాలు అనేవి ఒక ముఖ్యమంత్రి ఎక్కడైనా, ఎప్పుడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. అంత మాత్రం చేత పరిపాలన మొత్తం ఇక్కడ నుంచే ప్రారంభం అయిపోయి ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా మారిపోతుందన్నది సరైనదా? లేదంటే చంద్రబాబు అరెస్టును పక్కదోవపట్టించడానికే ప్రభుత్వ అధికారులు విఎంఆర్‌డిఎ ప్రాజెక్టులపై హడావుడి చేస్తున్నారని ఇటీవల వ్యాఖ్యానించిన టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పిందే నిజమని ప్రజలు అనుకోవాలా? అనేది వైసిపి పెద్దలే సమాధానం చెప్పాల్సి ఉంది.

విశాఖ సమస్యలపై ప్రధాన పార్టీల స్పందన ఇలాగేనా?

విశాఖను అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. సింహాచలం భూములను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పరిష్కరిస్తానని 2019 ఎన్నికల జగన్ హామీ ఏమైంది ? నేడు ఎందుకు మౌనం వహిస్తున్నారు ? అంటూ ఆ పార్టీ పెద్దలను ఈ ప్రాంత ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సమస్య రగులుతున్నా వైసిపి, టిడిపి పెద్దలకు ఏమీ పట్టడం లేదు.

సిపిఎం ఈ నెల 20న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం' ఉత్తరాంధ్ర బైక్ యాత్రను ప్రారంభించింది. ఇప్పటి వరకూ విజయవంతంగా సాగిన ఈ యాత్ర ఉక్కు అంశాన్ని రాజకీయ అజెండాగా చేసింది. ఇక టిడిపి విషయానికొస్తే ఆ పార్టీ శ్రేణులు బాబుకోసం ఒకరోజు అంటూ రోజుల తరబడి అందులో పడి కొట్టుకుంటూ అసలైన ప్రజా, కార్మిక సమస్య అయిన స్టీల్‌ప్లాంట్‌ను విస్మరించాయి.

ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

విశాఖ పోర్టు అథారిటీతో అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోర్టు పరిసర ప్రాంతాలలో గాలి కాలుష్యాన్ని తగ్గించటం, కార్బన్ ఉద్గారాలను నిలువరించడంపై పరస్పర అంగీకారంతో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు పోర్టు ఛైర్మన్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

రసజ్ఞ ఆధ్వర్యాన 'ఎకో వైజాగ్' వీధి నాటిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వచ్ఛభారత్ కార్యాచరణలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జివిఎంసి ఆర్థిక సహకారంతో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన తలపెట్టిన 'ఎకో వైజాగ్' వీధి నాటిక అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ విషయాన్ని నిర్వాహకులు వేమలి త్రినాథరావు వెల్లడించారు. తనతో పాటు డప్పు రమణ, హేమ, మహేంద్ర, మోహిద్దీన్, జయలక్ష్మి, పోలిరెడ్డి నటీనటులుగా ఉన్నారన్నారు. ఈ నాటికను దండు నాగేశ్వరరావు నాటకీకరించగా తాను దర్శకత్వం వహించారన్నారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 460/2022

Between:
Smt. Bora Ramanamma & 4 others ...Plaintiffs
And:
Muthyala Apparao & 9 others ...Defendants

SUMMONS

To,
D-3: Muthyala Kanakaraju,
S/o. late Subrahmanyam,
aged 50 years, Hindu,
R/at D.No. 51-14-34/1,
Kranthi Nagar, Nakkavanipalem,
Visakhapatnam-530013.

Whereas the above named plaintiffs filed suit O.S.460/2022 for partition against you and other defendants before the Hon'ble Court of the VI Additional Senior Civil Judge, Visakhapatnam, The said suit stands posted to **06-10-2023** for your appearance. You are hereby summoned to appear before the above named Court either in person or by a pleader on **06-10-2023 at 10.30 A.M.** to answer the same, failing which the matter will be decided in your absence and disposed of ex-parte.

(By Order of the Hon'ble Court)
T.V. SASTRY & Co.,
N. SURIBABU
Advocates,
Visakhapatnam.

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నర్సీపట్నం
O.S. No. 234 / 2022

బిట్వీన్:
గల్లా చిన్నమ్ములు . . . వాది
అండ్:
గుర్రం సీతారత్నం, భర్త అప్పలనాయుడు
R/at. గుర్రాలపాలెం గ్రామం,
జోగుంపేట పోస్టు రోలుగుంట మండలం,
అనకాపల్లి జిల్లా. . . . 6వ ప్రతివాది

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ ప్రతివాదిపై నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో Partition దావా O.S.No. 234/2022 గా దాఖలు చేయడమైనది. అనేక పర్యాయాలు కోర్టు వారు నోటీస్లు జారీ చేసినా, ఈ ప్రతివాది నోటీస్ తీసుకోకుండా తప్పించు కుంటున్నారు. అందులకు చివరిగా ఈ దావా వాయిదా **తేది: 09-10-2023గా** ఇచ్చియున్నారు. ఈ తేదీన **ఉదయం గం. 10-00లకు** పైన తెలిపిన కోర్టులో హాజరు కాగలరు. లేనియెడల ఈ ప్రతివాదిపై Exparte Decree ఇవ్వబడును.

మాకిరెడ్డి బుల్లిదొర
సింగంపల్లి రామలక్ష్మి
న్యాయవాదులు,
నర్సీపట్నం, అనకాపల్లి జిల్లా.

మహారాజశ్రీ విశాఖపట్టణ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 527/2018 in O.S. 108/2011

సదరు:
M/s. నిపుణ కన్‌స్ట్రక్షన్స్ తరుపున పార్టనర్ అయిన **శ్రీ యస్.వి. సత్యనారాయణ రాజు** ...పిటీషనరు/వాది
మరియు
మాకెన అచ్యుతరామయ్య పాత్రుడు వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
R-18: దాట్ల రామకృష్ణ రాజు, S/o. లేటు సూర్యనారాయణరాజు, సా॥గ్రా॥ డోర్ నెం. 50-121-14, బాలాజి హిల్స్, బాలయ్యశాస్త్రి లే-అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-13.
R-20: జి. శ్రీనివాస్, S/o. జి.వి. సుబ్రహ్మణ్యం, డోర్ నెం. 50-24-8/7, టి.పి.టి. కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-13.
R-21: రాజ కలిదిండి కుమార లక్ష్మి నరసింహ రాజు బహుదూర్, S/o. లేటు కుమార వెంకట కృష్ణరాజు బహుదూర్, ప్లాట్ నెం. 203, 2వ అంతస్తు, బ్లాక్-ఏ, కె.యస్.ఆర్. గార్డెన్ వేలీ, మద్రిపాలెం, విశాఖపట్నం-18.
R-23: శ్రీమతి రాజ కలిదిండి శ్యామల, W/o. రాజ కలిదిండి కుమార లక్ష్మి నరసింహ రాజ బహుదూర్, డోర్ నెం.10-103, మొగల్తూరు కోట, పశ్చిమ గోదావరి జిల్లా,
R-25: దాట్ల సుబ్బరాజు, S/o. లేటు సూర్యనారాయణరాజు, ప్లాట్ నెం.211, సి-బ్లాక్, వైశాఖి రెసిడెన్సీ, ఫేకర్ లే-అవుట్,వాల్తేర్ వార్డు, విశాఖ-13
R-36: తేతలి శ్రీధర్, S/o. లేటు వెంకట అప్పారావు, హౌస్ నెం.8-158/A, మనగనూర్ డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
R-37: తూమ రమేష్ దాస్, S/o. లేటు టి.జి. కృష్ణదాస్, LIG-76, 2వ అంతస్థు, హెచ్.బి. కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం.

నోటీసు

పై నెంబరు గల I.A. 527/2018 in O.S.108/2011 నందు మీరు రెస్పాండెంట్లు/ప్రతివాదులు 18, 20, 21, 23, 25, 36 మరియు 37 అయి యున్నారు. సదరు I.A. 527/2018 **తేది.21-11-2023**న మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగాగాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో **తేది.21-11-2023**న **ఉదయం 10.30 గం॥** లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని పక్షంలో పైనెంబరు గల I.A. ను మీ పరోక్షమందు తీర్మానించెదరని మీకు తెలియజేయడమైనది.

V.V. RAVI PRASAD & J.V. RAMAKRISHNA
Advocates
45-57-3/B, Narasimhanagar, Visakhapatnam.

మహారాజశ్రీ విశాఖపట్టణ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. 526/2018 in O.S. 108/2011

సదరు:
M/s. నిపుణ కన్‌స్ట్రక్షన్స్ తరుపున పార్టనర్ అయిన **శ్రీ యస్.వి. సత్యనారాయణ రాజు** ...పిటీషనరు/వాది
మరియు
మాకెన అచ్యుతరామయ్య పాత్రుడు వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
R-18: దాట్ల రామకృష్ణ రాజు, S/o. లేటు సూర్యనారాయణరాజు, సా॥గ్రా॥ డోర్ నెం. 50-121-14, బాలాజి హిల్స్, బాలయ్యశాస్త్రి లే-అవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-13.
R-20: జి. శ్రీనివాస్, S/o. జి.వి. సుబ్రహ్మణ్యం, డోర్ నెం. 50-24-8/7, టి.పి.టి. కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-13.
R-21: రాజ కలిదిండి కుమార లక్ష్మి నరసింహ రాజు బహుదూర్, S/o. లేటు కుమార వెంకట కృష్ణరాజు బహుదూర్, ప్లాట్ నెం. 203, 2వ అంతస్తు, బ్లాక్-ఏ, కె.యస్.ఆర్. గార్డెన్ వేలీ, మద్రిపాలెం, విశాఖపట్నం-18.
R-23: శ్రీమతి రాజ కలిదిండి శ్యామల, W/o. రాజ కలిదిండి కుమార లక్ష్మి నరసింహ రాజ బహుదూర్, డోర్ నెం.10-103, మొగల్తూరు కోట, పశ్చిమ గోదావరి జిల్లా,
R-25: దాట్ల సుబ్బరాజు, S/o. లేటు సూర్యనారాయణరాజు, ప్లాట్ నెం.211, సి-బ్లాక్, వైశాఖి రెసిడెన్సీ, ఫేకర్ లే-అవుట్,వాల్తేర్ వార్డు, విశాఖ-13
R-36: తేతలి శ్రీధర్, S/o. లేటు వెంకట అప్పారావు, హౌస్ నెం.8-158/A, మనగనూర్ డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
R-37: తూమ రమేష్ దాస్, S/o. లేటు టి.జి. కృష్ణదాస్, LIG-76, 2వ అంతస్థు, హెచ్.బి. కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం.

నోటీసు

పై నెంబరు గల I.A. 526/2018 in O.S.108/2011 నందు మీరు రెస్పాండెంట్లు/ప్రతివాదులు 18, 20, 21, 23, 25, 36 మరియు 37 అయి యున్నారు. సదరు I.A. 526/2018 **తేది.21-11-2023**న మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగాగాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో **తేది.21-11-2023**న **ఉదయం 10.30 గం॥** లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని పక్షంలో పైనెంబరు గల I.A. ను మీ పరోక్షమందు తీర్మానించెదరని మీకు తెలియజేయడమైనది.

V.V. RAVI PRASAD & J.V. RAMAKRISHNA
Advocates
45-57-3/B, Narasimhanagar, Visakhapatnam.

దుకాణ సముదాయం.. హామీకే పరిమితం...

ప్రజాశక్తి- భీమునిపట్నం : పురపాలక సంఘంగా ఉన్న కాలంలో స్థానిక గంట స్తంభం సమీపంలో దాదాపు 20 దుకాణాలను నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరాయన్న కారణంతో గతేడాది దుకాణాల్లో ఉన్న వ్యాపారులను జివిఎంసి ఒకటో జోన్ అధికారులు ఖాళీ చేయించారు. ఆధునిక పద్ధతిలో దుకాణ సముదాయం నిర్మిస్తామంటూ జివిఎంసి అధికారులు చెబుతూ వస్తున్నారు. అధికారుల హామీలు నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం

ఆధునిక పద్ధతిలో దుకాణ సముదాయం నిర్మించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. వీలైనంత త్వరగా దుకాణ సముదాయం నిర్మించేలా ప్రయత్నం చేస్తాం.

బొడ్డేపల్లి రాము
జోనల్ కమిషనర్
జివిఎంసి ఒకటో జోన్
భీమునిపట్నం

ప్రత్యామ్నాయం చూపకుండానే కూల్చివేత

సుమారు 25-30 ఏళ్ల క్రితం పురపాలక సంఘం, వుడా సహకారంతో ఇక్కడ నిర్మించిన దుకాణ సముదాయం సుమారు 20 మంది చిరు వ్యాపారులకు ఉపాధి ఇచ్చేది. వివిధ వ్యాపారాలు చేసుకుంటూ జీవించే వారు. తద్వారా అప్పటి పురపాలక సంఘానికి, ప్రస్తుత జివిఎంసికి కూడా పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది. శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయాన్ని కూల్చివేయడం స్వాగతించాల్సిందే. అదే సమయంలో ఆయా దుకాణాల్లో ఎంతో కాలంగా పలు దుకాణాలు నిర్వహించుకొని ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అదిగో ఇదిగో అంటూ తాత్సారం

కూల్చేసిన దుకాణ సముదాయ స్థలం

నేరాలు ఘోరాలు

పెద్దఉప్పలంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని పెదఉప్పలం గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైనట్లు స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. శనివారం ఉదయం మృతుని కుటుంబ సభ్యులిచ్చిన సమాచారం మేరకు పెదఉప్పలం గ్రామానికి చెందిన దళితుడు లండా జోగారావు(35)ను అదే గ్రామానికి చెందిన వారు హత్య చేసినట్లు తెలిపారు. హత్యకు గీతకార్మికులు కత్తి పదును పెట్టేందుకు ఉపయోగించే కర్రను ఆయుధంగా ఉపయోగించినట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళల అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:సారాను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకొని అరెస్టు చేశామని కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, నాటుసారా అక్రమంగా తయారుచేసి, అమ్ముతున్నారని సమాచారం మేరకు కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను వేరు వేరు కేసుల్లో పట్టుకొని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇద్దరి వద్ద ఐదేసి లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నామన్నారు.

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి-కొత్తకోట:భార్యపై అనుమానంతో తలపై కొట్టి హత్య చేసిన సంఘటన రావికమతం మండలం చీమలపాడు శివారు అజేయపురం గిరిజన గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి వంతల పొట్టిదొర ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఇన్చార్జి ఎస్ఐ కుమారస్వామి శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు గిరిజన గ్రామానికి చెందిన వంతల పొట్టి దొర కుమార్తె పార్వతితో పాంగి గణపతికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులున్నారు. గణపతి తరచూ మద్యం సేవిస్తూ భార్యను అనుమానిస్తూ వేదింవాడు. పలువురు సర్ధి చెప్పినా కొన్ని రోజుల తర్వాత మామూలుగా ఉండేవాడు. మృతురాలు పార్వతి అన్నీ సహించి కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. ఈ నేపద్యంలో శుక్రవారం రాత్రి గణపతి మరింత పూటుగా మద్యం సేవించి పార్వతితో గొడవపెట్టుకున్నాడు. కత్తికి ఉపయోగించే వెదురు పెడు (కొయ్య)తో బలంగా పార్వతి తలపై బలంగా కొట్టాడు.దీంతోచ తన కుమార్తె అక్కడికక్కడే మృతి చెందిందని మృతురాలి తండ్రి వంతల పొట్టిదొర ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. గణపతిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న సుబ్రమణ్యం

సుబ్రమణ్యానికి డాక్టరేట్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు బొల్లా సుబ్రమణ్యం ఎయు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ మేథమెటిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ఆచార్య సిహెచ్.శాంతి సుందరరాజు పర్యవేక్షణలో ఫజ్జి ఐడియల్స్ అండ్ ఫిల్టర్స్ ఆఫ్ సెమిలాటిసెస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఎయు వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి ద్వారా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఇందుకు గాను సుబ్రమణ్యాన్ని శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, సహచర అధ్యాపకులు ప్రశంసించారు.

కొవ్వాడలో గడపగడపకు...

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో భారీ వర్షం పడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. అయినా కార్యక్రమాన్ని కొనసాగించారు..

282 భూ హక్కు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బాంధవపురం పంచాయతీ పరిధిలోని విజయరామపురం గ్రామంలో 323 ఎకరాల భూమికి సంబంధించిన భూమి హక్కు పుస్తకాలను శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద వర్గాలు, రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా వారి భూములను సర్వే చేసి హక్కు పత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్ఒ శ్రీనివాసరావు, ఎంపిపి రాంబాబు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నెఫ్రాలజీ ఆరో వార్షిక సమావేశం ప్రారంభం

డాక్టర్ల సదస్సును ప్రారంభిస్తున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ఆరో వార్షిక రాష్ట్ర సమావేశాన్ని విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు నెఫ్రాలజీ రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మాజీ డిఎంఇ, ఎన్‌టిఆర్‌యుహెచ్‌ఎస్ వీసీ డాక్టర్ టి.రవిరాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్ గుల్లిపల్లి నిర్వహణలో సాగిన సమావేశంలో 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి విశాఖపట్నం పోలీసు కమిషనర్, ఎపి ఎడిజిపి రవిశంకర్ అయ్యనార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఒక్క ఏపీలోనే ఏడాదికి దాదాపు 9000 రోడ్డు ప్రమాద మరణాలు సంభవిస్తున్నాయి. వీరిలో కొద్ది శాతం మంది అవయవాలను దానం చేస్తే, అవయవ కొరత తగ్గుతుందన్నారు.

డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ, నెఫ్రాలజీ విభాగాన్ని ఆంధ్ర వైద్య కళాశాలలో 1985లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కిడ్నీ మార్పిడి, క్రానిక్ కిడ్నీ డిసీజ్ సీకేడీయూ ఏర్పాటు గురించి కూడా వివరించారు. ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్రా వైద్య కళాశాల వైభవాన్ని ఆయన వివరించారు.

వివిధ కిడ్నీ రుగ్మతలు, కిడ్నీ వ్యాధి చికిత్సలో సవాళ్లపై మెడికల్ సెషన్‌లు నిర్వహించారు. ఈ సదస్సు జ్ఞానం, నైపుణ్యాల మార్పిడికి వేదిక అయింది. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎన్ రాష్ట్ర అధ్యక్షుడు పిఎన్.జిక్కి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రామకృష్ణచ ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జి.బుచ్చిరాజు పాల్గొన్నారు.

ఐఐహెచ్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : తీవ్రమైన తలనొప్పి ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ (ఐఐహెచ్) వ్యాధికి కారణం కావచ్చుని న్యూరో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ వీరేందర్ సచ్ దేవా పేర్కొన్నారు. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల న్యూరో ఆప్తమాలజి వైద్య బృందం ఆధ్వర్యాన ఆసుపత్రిలో శనివారం ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి సాధారణంగా గర్భధారణ వయస్సు 20 నుంచి 50 మధ్య వయస్సు గల స్త్రీలలో, ఊబకాయం ఉన్న వారిలో వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఈ వ్యాధి రెండు కళ్లను, మెదడును ప్రభావితం చేస్తుందన్నారు. ఎడతెగని తలనొప్పి ఈ వ్యాధి సాధారణ లక్షణమన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే దృష్టి లోపం, చూపును పునరుద్ధరించలేని నష్టం, ఇతర సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. తీవ్రమైన తలనొప్పి వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే న్యూరాలజిస్ట్ లేదా ఆప్తమాలజిస్ట్‌ను సంప్రదించాలని డాక్టర్ వీరేందర్ తెలిపారు. ఈ వ్యాధి ఊబకాయం, విటమిన్ -ఎ సంప్లిమెంట్స్, యాంటిబయాటిక్ వాడకం, గర్భ నిరోధక మాత్రలు వాడటం, స్టెరాయిడ్స్ వంటి ప్రత్యేక మందులు తీసుకున్న వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎల్‌విప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఈ వ్యాధి నిర్ధారణకు అవసరమైన అన్ని ఆధునిక పరికరాలు, చికిత్స అందించేందుకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వీరేందర్ సచ్ దేవా

పాలిటెక్నిక్ కళాశాలలో 3న స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో మిగులు సీట్లకు సిసిపి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో తక్షణ ప్రవేశాలకు అక్టోబర్ 3న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ శనివారం తెలిపారు. పాలిసెట్ -2023 ప్రవేశ పరీక్ష రాయకపోయినా, టెన్త్ కంపార్ట్‌మెంటల్ ద్వారా పాసైన విద్యార్థినిలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లు ద్వారా సీటు పొందిన వారికి ఎలాంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉండదని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినిలు ఎస్ఎస్‌సి మార్కుల లిస్ట్, పాలిసెట్ -2023 హాల్ టికెట్ పరీక్షకు హాజరైనచో టిసి, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, 5 సెట్ల జెరాక్స్ కాపీలు, 3 పాస్ ఫొటోలు, ఫీజు రూ.6వేలుతో ఈ నెల 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9912342045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పగిలిన పైపులైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం : బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధి శుభశ్రీ ఫంక్షన్ హాల్, వై జంక్షన్ వద్ద పగిలిన తాగునీటి పైపు లైను ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంది. 'వృథాగా తాగునీరు' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాగునీటి పైపులైనుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు మధ్యలో పైపు పగలడంతో నీరు వృథా కావడమే కాకుండా, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి మరమత్తులు చేయడంతో బంటుబిల్లి కల్లాలకు తాగునీరు అందింది. ఈ మేరకు గ్రామస్తులు ప్రజాశక్తి పత్రికను అభినందించారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేసిన జివిఎంసి సిబ్బంది

5న బహిరంగసభను జయప్రదం చేయాలి

పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -యంత్రాంగం

స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఈ నెల 5వ తేదీన జరిగే ఉక్కు రక్షణ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం సమావేశాలు, పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 5వ తేదీన నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. జోన్ - 6 పరిధి 75, 76వ వార్డు పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం పెదగంట్యాడ మండలం నడుపూర్ మస్టర్ పాయింట్ల వద్ద శనివారం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, సావిత్రి, సూరిబాబు, లక్ష్మి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడంలో భాగంగా అక్టోబర్ 5న బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద బహిరంగ సభకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలు ఉధృతమైతే పాలకుల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, సిఐటియు నాయకులు ఎన్.రామారావు, కూన వెంకట్రావు, పి.శ్రీనివాసరాజు, గంగాధర్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, మొహిద్దిన్, దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, డిఎస్‌వివిఎస్.శ్రీనివాస్, శంకరరావు, గోపాలకృష్ణంరాజు, భానుమూర్తి, మధుసూదన్, వివి.పూర్ణచంద్రరావు, దేముడునాయుడు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే ఉక్కు రక్షణ బహిరంగ సభ పోస్టర్‌ను సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నాయకులు కె.నర్సింగరావు మాట్లాడారు. కార్యక్రమంలో పోలయ్య, సింగనాయుడు, ఈశ్వరరావు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టీల్ సిఐటియు నాయకులు

న్యాయవాదుల రక్షణ చట్టంపై ఉద్యమం

ప్రజాశక్తి-లీగల్ : న్యాయవాదుల రక్షణ చట్టంపై ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం జిల్లా కమిటీ అభిప్రాయపడింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం జిల్లా నూతన కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు అల్లు సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆ సమస్యలను అధిగమించేందుకు వివిధ పద్ధతుల్లో ఉద్యమాలు చేయాలని సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అనంతరం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, న్యాయవాదుల రక్షణ చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి చట్టంగా రూపొందించాలని తీర్మానం చేస్తూ, ఆ తీర్మాన ప్రతిని శాసనసభ స్పీకర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్, చాట్ల ఆనందరెడ్డి, ఎంపీ మధు, పాపారావు, కార్యదర్శులు పూర్ణిమ, కెవై.మణి, పార్వతీశ్వరరావు, ఈశ్వరరావు, సంతోషి, గణపతి, కోశాధికారి బి.అప్పలరెడ్డి, గౌరవాధ్యక్షులు బివి.రామాంజనేయరావు పాల్గొన్నారు.

ఎంవిఎన్.కపర్ది శతజయంతి సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఎంవిఎన్.కపర్ది శత జయంతి సభను ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. 'భారతదేశ భావన - మార్క్సిస్టు దృక్పథం' అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివ్ ప్రతినిధి డాక్టర్ రవి ప్రకాష్ సిన్హా మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో ఏమాత్రం పాత్రలేని హిందుత్వ భావజాలం ఆ తర్వాత ఆధిపత్యం సాధించిందని చెప్పారు. దీన్ని కమ్యూనిస్టులు తిప్పికొట్టాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, మార్క్సిస్టు సిద్ధాంత అవగాహనతో కపర్ది ఎన్నో కార్మిక సంఘాలను నిర్మించారని చెప్పారు. కార్మిక ఉద్యమం - కుల అస్తిత్వ ఉద్యమాలు, భవిష్యత్తు అంశంపై ఆచార్య కె.శ్రీనివాసులు, అసంఘటిత రంగం కార్మిక ఉద్యమాలు - సమస్యలపై ఆచార్య జి విజయ్, ఐటీ రంగం, కృత్రిమ మేధ - భవిష్యత్తు కార్మిక ఉద్యమం అంశంపై వై.కిరణ్ చంద్ర ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కపర్ది కుమారుడు జగన్మోహన్‌రావు, కుమార్తె అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత పాఠశాల
మధ్యాహ్న భోజనాన్ని ఐఇ పరిశీలన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం ఆధ్వర్యాన నడుస్తున్న సంస్కృత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఐఇ సింగాల శ్రీనివాసమూర్తి పరిశీలించారు. పాఠశాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కొరత విషయాన్ని ఐఇ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఐఇ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నరసింహరాజు, ఇఇ రాంబాబు ఎఇఒ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-ఆనందపురం : నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆనందపురం క్రైమ్ ఎస్ఐ ఎ.మన్మధరావు కోరారు. వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో గ్రామస్తులకు నేరాల పట్ల అప్రమత్తంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఉపయోగం గురించి వివరించారు. కొత్తగా ఇల్లు కట్టుకున్న వారు తప్పనిసరిగా సిసి కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఇటీవల గొలుసు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరి మహిళ బయటకు వెళ్లేటప్పుడు వీలైనంత మేరకు బంగారపు వస్తువులను ధరించకుండా ఉండాలన్నారు. కుటుంబం మొత్తం ఊరు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులను భద్రత గల ప్రదేశంలో ఉంచుకోవాలని సూచించారు. ఈ విషయంపై కరపత్రాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, తాతమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు దయాల్‌బాగ్ ఫుట్‌వేర్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద అక్టోబరు 2న దయాల్‌బాగ్ ఫుట్‌వేర్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దక్షిణామూర్తి తెలిపారు. మహిళలకు, పురుషులకు చెప్పులు, అన్ని రకాల బూట్లు తదితర వస్తువులు అమ్మకానికి ఉంచనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు.

విశాఖ ఉక్కును రక్షించుకుందాం

దీక్షలో కూర్చున్న సెంటర్‌ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కును రక్షించుకుందామని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 961వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సెంటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉక్కు భూములపై కన్నేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా, విశాఖ ఉక్కును పరిరక్షించకుండా ప్లాంట్ ఆస్తులను కాజేయాలని ప్రయత్నించే వారు ఎంతటి వారైనా ఎదిరిస్తామన్నారు. విశాఖ ఉక్కును మట్టుపెట్టాలని ప్రయత్నించిన గత ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పామని గుర్తు చేశారు. ప్రజల ఆకాంక్షలను గాలికి వదిలేసి ప్రజల సమస్యలను ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలకు కాలం చెల్లిందన్నారు. సంస్థ మనుగడ కోసం సర్వం కోల్పోయి, నేటికీ ఉపాధి కోసం వేలాది మంది ఎదురు చూస్తుంటే విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూడడం మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాటంలో రాజకీయ నాయకుల నిజస్వరూపాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ చైతన్యం కల్పిస్తున్నామని, పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి, మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

కైలాసగిరి కూడలి అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధిలోని కైలాసగిరి కూడలి అభివృద్ధికి తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి. సత్యనారాయణ, కార్పొరేటర్ కోరుకొండ స్వాతిదాస్‌తో కలిసి శనివారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకటకుమారి, ఎంపి ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, నగరంలో ప్రతి కూడలినీ అభివృద్ధి చేస్తామని చెప్పారు. స్మార్ట్ నిధులు రూ.76 లక్షలతో పర్యాటకులకు, నగర వాసులకు అందంగా కనిపించే విధంగా కైలాసగిరి కూడలిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఉమ్మిడి దాసు, వైసిపి నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయు లుక్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు లుక్స్ డిజిటల్ స్టూడియోను విడిఎం ఇండియా ఆన్ ది మూవ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అజిత్‌కుమార్ ఆచార్య శనివారం ప్రారంభించారు. ఎయు లుక్స్ వార పత్రికలను, డిజిటల్ ఛానల్ సేవలను అజిత్ కుమార్ ఆచార్య అభినందించారు. ఎయు అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. ఎయు వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం సమాచారం వీడియో, ఆడియో ద్వారా ఎయు లుక్స్ డిజిటల్ ఛానల్ ప్రసారం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య శ్రీనివాసరావు, శశిభూషణరావు, ఎ.నరసింహరావు, రాజేంద్రప్రసాద్, శోభశ్రీ, విజయలక్ష్మి, భట్టి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టి : వీసీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణల దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సూచించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా శనివారం ఎయు కన్వెన్షన్ సెంటర్లో సమావేశాన్ని నిర్వహించారు.

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఉప్పుటేరు ప్రాంతంలో రూ. 28.7 కోట్లతో 6 ఎకరాల విస్తీర్ణంలో పలు సదుపాయాలతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ స్థలాన్ని పరిశీలించారు. ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఆక్షన్ హాల్, వలల మరమ్మతులకు వీలుగా షెడ్ల నిర్మాణం, 170 బోట్ల యాంకరింగ్‌కు వీలుగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫిష్ ల్యాండింగ్ సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

2 నుంచి గాంధీ ఆలోచన ఔచిత్యంపై సదస్సు

ప్రజాశక్తి-విశాఖపట్నం: అభివృద్ధి చెందుతున్న ప్రపంచ క్రమంలో 'గాంధీ ఆలోచన- ఔచిత్యం' అనే అంశంపై ఈ నెల 2, 3 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య కె.సీతామాణిక్యం తెలిపారు. దేశ, విదేశీ విశ్వ విద్యాలయాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సును ఎయు వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. గ్లోబల్ పీస్ అంబాసిడర్ డాక్టర్ రానియా లాంపా, ఆస్ట్రేలియాలోని గాంధీ ఎక్స్‌పెరిమెంట్స్ వ్యవస్థాపకులు మార్గరెట్ హాపీవర్ట్ ముఖ్య సందేశాలను ఇస్తారని వివరించారు. వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ న్యాయ కళాశాల డీన్ ఆచార్య చక్కా బెనర్జీ ప్రత్యేక ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. 100 పరిశోధనాపత్రాలను ఎనిమిది టెక్నికల్ సెషన్స్‌లో చర్చిస్తారని సీతామాణిక్యం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం

స్వల్ప గాయాలతో బయటపడ్డ ఇద్దరు కుమార్తెలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఎదురుగా వస్తున్న కారు హెడ్‌లైట్ల వెలుతురు కారణంగా ముందు ఉన్న లారీ కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనం లారీ కిందకు దూసుకెళ్లిన ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందిన సంఘటన కె.కోటపాడు మండలం, కింతాడ శివారు బొట్టవానిపాలెం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్ తెలిపిన వివరాలు ప్రకారం... విశాఖపట్నంలో నివాసముంటున్న దేవరాపల్లి మండలం వేచలం గ్రామానికి చెందిన భార్య భర్తలు కె.దామోదర్ (35), ప్రసన్న (30), తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి వేచలం వస్తున్నారు. వీరు

సంఘటనా స్థలంలో భార్యాభర్తల మృతదేహాలు

కె.కోటపాడు మండలం కింతాడ శివారు బొట్టవానిపాలెం గ్రామం వద్దకు వచ్చే సరికి కె.కోటపాడు నుంచి పెందుర్తి వెళ్తున్న కారు ఎదురుగా వచ్చింది. ఆ కారు హెడ్‌లైట్లు వెలుతురు ద్విచక్ర వాహనం నడుపుతున్న దామోదర్ కళ్లకు కొట్టడంతో తన ముందు విశాఖపట్నం నుంచి కె.కోటపాడు సివిల్ సప్లై బియ్యం లోడుతో వెళ్తున్న లారీ కనిపించలేదు. దీంతో దామోదర్ ద్విచక్ర వాహనం లారీ కిందకు దూసుకెళ్లిపోయి భార్యాభర్తలు దామోదర్, ప్రసన్న ఇద్దరూ లారీ చక్రాల కిందకు పడిపోయారు. ఈ ప్రమాదంలో ప్రసన్న తల నుజ్జునుజ్జు కాగా, దామోదర్ శరీరమంతా నుజ్జు అయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బైక్ మీద ఉన్న కుమార్తెలిద్దరూ తల్లిదండ్రుల ఇద్దరి మధ్య ఉండటంతో స్వల్ప గాయాలతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న కె.కోటపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్ కె.మాధవరావును అదుపులో తీసుకొని, లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంలో గాయపడిన పిల్లలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి వారి స్వగ్రామం వేచలం తరలించారు. మృతుడు దామోదర్ తండ్రి రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. కాగా ఆదివారం తమ స్వగ్రామం వేచలంలో జరుగు పశువుల పండగ నిమిత్తం దామోదర్ తన భార్య, కుమార్తెలతో వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

అత్యాచారాలు జరగకుండా పటిష్ట చర్యలు : జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై ఎటువంటి అత్యాచారాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ ఎండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై ఎటువంటి అన్యాయం జరిగినా వెంటనే కమిటీకి తెలియజేయాలని తెలిపారు. కమిటీ సభ్యులు తక్షణం స్పందించి తగిన న్యాయం చేయాలన్నారు. ప్రతినెల పౌర హక్కుల దినోత్సవాన్ని తప్పక పాటించాలన్నారు. మండల గ్రామస్థాయిలలో ఎస్సీ, ఎస్టీలకు గల హక్కులపై అవగాహన కలిగించేందుకు పౌర హక్కుల దినోత్సవాన్ని జరపాలన్నారు. ఎస్సీ ఎస్టీల భూ హక్కులను గురించి సభ్యులు లేవనెత్తగా వారానికి రెండు పర్యాయాలు ఆయా మండలాల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వీటిని చర్చించి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పి కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ జూన్ 15 తేదీ వరకు 57 యుఐ కేసులు ఉండగా మధ్యకాలంలో 28 కేసులు నమోదయాయని, 8 కేసులు పరిష్కరించగా ప్రస్తుతం 77 కేసులు పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. 261 పిటి కేసులు ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, నర్సీపట్నం ఆర్డీఓ జయరాం, అనకాపల్లి పరవాడ డీఎస్పీలు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అజయ్ బాబు సభ్యులు డిహెచ్ఓ జి.ప్రభాకర్ రావు, విఐపిఆర్ఓ కె.ఇంద్రావతి, డిపిఓ ఆర్.శిరీష రాణి, ఆర్.మధుబాబు, ఎం. అప్పలరాజు, ఈశ్వరరావు, బి.అప్పారావు, జే.తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు సహాయ సహకారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని బధిరులకు ఎటువంటి అవసరం ఉన్నా ఎంవిఆర్ ట్రస్ట్ తరఫున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) తనయుడు ముత్యాల సతీష్ (సంజూబాబు) వెల్లడించారు. శనివారం పట్టణంలోని గవరపాలెం వివి రమణ రైతు భారతి హాల్‌లో అనకాపల్లి జిల్లా మూగ - చెవిటి అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సంకేత భాష దినోత్సవ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌తో పాటు సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బధిరుల గురించి పట్టించుకునే నాధుడే లేరన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ప్రభుత్వం తరఫున ఎటువంటి హామీలు లేకపోవడం వలన ప్రైవేట్ పనులు చేసుకుంటూ చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఉన్న అవయవ లోపాన్నే సాకుగా చూపిస్తూ వారిని వివక్షకు గురిచేస్తున్నారన్నారు. ఆటుపోటులను ఎదుర్కొని మానసికంగా కృంగిపోకుండా ముందుకు సాగాలని బధిరులకు పిలుపునిచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ వీరికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. అనంతరం వీరి చేతుల మీదగా సంకేత భాష పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు వారిని జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జివిబి జగదీష్, డెఫ్ అండ్ డం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వి చంద్రశేఖర్, కార్యదర్శి ఎన్ శాంతి బాబు, కారిడి రాజు, బధిరులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలని బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం వివిధ బ్యాంకుల వద్ద బ్యాంకు సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తుమ్మపాల యూనియన్ బ్యాంక్ వద్ద అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు ఉద్యోగ విరమణ, చనిపోవడం వంటి కారణాల వల్ల ఖాళీ అయిన ఉద్యోగులను ప్రభుత్వం భర్తీ చేయకుండా బయట ఒప్పంద కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటుందని పేర్కొన్నారు. ఈ పోస్టులను భర్తీ చేయకుండా గత కొన్నేళ్లుగా కాలయాపన చేస్తున్నందుకు నిరసన తెలియపరుస్తున్నామని తెలిపారు. తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కాటాలు విభాగంలో మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సెప్టెంబర్ 24న హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కాటా విభాగంలో గాయత్రి పాఠశాల విద్యార్థులు బంగారు, వెండి, పతకాలను సాధించారు. పతకాలు సాధించిన డి బిందు, సిహెచ్ మౌనిక, ఎం వెంకటేష్, సిహెచ్. వైష్ణవి, సిహెచ్ యశ్వంత్, కె.లోకేష్, సిహెచ్.నీరజ్ నాయుడు తదితరులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు నగేష్, యాజమాన్యం సభ్యులు ఐ అప్పారావు, కోచ్ సిహెచ్ సూరి అప్పారావు అభినందించారు.

ఎంఎస్.స్వామినాథన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-చోడవరం

వ్యవసాయ రంగంలో ఆహార భద్రతకు ఆధునిక రూపాన్ని ఇచ్చిన ఎమ్ఎస్. స్వామినాథన్ మృతి దేశానికి తీవ్ర నష్టమని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ అన్నారు. శనివారం కళాశాల సమావేశ మందిరంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణాజీ మాట్లాడుతూ దేశంలో వరి, గోధుమ పంటల్లో కొత్త వంగడాలు సృష్టించడంలో స్వామినాథం చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ సంస్థల అధ్యాపక సిబ్బంది తెలుగు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉషోదయ రమణాజీ, విద్యార్థులు

అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో శనివారం భారతదేశ అతి గొప్ప శాస్త్రజ్ఞులలో ఒకరైన పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు మాట్లాడుతూ ఎమ్మెస్ స్వామినాథన్ జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వర రావు, బోటనీ హెడ్ డాక్టర్ హరిబాబు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, అగ్రికల్చర్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

గొర్రెలు మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గొర్రెలు మేకల పెంపకందారుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గొర్రెలు మేకల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ గంట శ్రీరామ్ డిమాండ్ చేశారు. యూనియన్ సర్వసభ్య సమావేశం శనివారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవన్‌లో శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడిసి రుణంగా విడుదల చేసిన రూ.88 కోట్లు వెంటనే విడుదల చేయ్యాలని, 559, 1016 జీవోలు ప్రకారం స్థలాలను కేటాయించాలని, 50 సంవత్సరాల నిండిన పెంపకం దారులకు వృద్ధాప్య ఫించన్లు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. జీవో 559, 1016లు ప్రకారం గొర్రెలు మేకల పెంపకందారులకు 25 ఎకరాలు వరకు స్థలాలను కేటాయించాలని, గొర్రెలకు, మేకలకు సంవత్సరానికి నాలుగు సార్లు డివార్మింగ్ మందులు వేయాలని, అవసరమైన వ్యాక్సిన్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, జిల్లా డైరెక్టర్లు పినిబోయిన అప్పారావు యాదవ్, ఉరిగిటి శివ సూర్యనారాయణ, గోకాడ దేముడు నాయుడు, బొట్ట వరహాలు, పాట్నాల అప్పలరాజు, పల్లా సత్యారావు, ఎదిరి అప్పారావు, పల్లా శ్రీరాములు, మిష్క రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి కూడలిలో జెండా రింగ్ పోల్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్‌టిపిసి యాజమాన్యం అందిస్తున్న సిఎస్ఆర్ నిధులతో జలగల మదుం జాతీయ రహదారి కూడలి వద్ద నిర్మిస్తున్న భారీ జాతీయ జెండా రింగ్ పోల్ నిర్మాణాన్ని, పనుల పురోగతిని శనివారం జాతీయ రహదారి ఇంజనీర్‌తో కలసి ఎంపీ సత్యవతి పర్యవేక్షించారు. ఈ జాతీయ జెండా ప్రజలకు, యువతకు మరింత దేశభక్తిని పెంపొందిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 10 రోజులలో పని పూర్తి అవుతుందని, అనంతరం నేషనల్ హైవే అధికారులు ఈ కూడలిని మరింత సుందరంగా తీర్చిదిద్దుతారని తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-అనకాపల్లి

దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటమే శరణ్యమని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. వెంకటేష్, బి.ఈశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం హాలులో శనివారం జరిగిన అనకాపల్లి ప్రెస్ క్లబ్ సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. మంత్రి అమర్‌తో వివరించారని సమావేశమై సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతామన్నారు. మంత్రి అమర్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు విషయంలో చిత్తశుద్ధితో లేరని, పోరాటమే మేలని అధికశాతం పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. నల్లబ్యాడ్జీలు ధరించి వైసీపీ కార్యక్రమాలకు కొంత కాలం హాజరు కావాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా ఏపీయుడబ్ల్యూజే యూనియన్‌కు చెందిన నాయకులు కాండ్రేగుల మోహన్, రామారావు, నటరాజ్, గంగాధర్, మణి కుమార్, నాయుడు తదితరులు ఫెడరేషన్ సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు, కార్యదర్శి పి.రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు చాంద్ భాషా, పి.నాగ, తిమ్మాపాత్రుని రమేష్, మార్తూరు అజయ్, పెంటకోట సత్యనారాయణ, బొడ్డేడ శ్రీనివాసరావు, పి.సురేష్, కె.భాను, కె.గణేష్, గోపాల్, చంద్రశేఖర్, సతీష్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి :స్థానిక శారదా నది వద్ద గల శాంతి పార్కు అభివృద్ధికి ఎంపీ నిధుల నుండి రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి తెలిపారు. శనివారం ఆమె పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు కావలసిన సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే జీవీఎంసీ అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ సూచనలతో త్వరలో పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కె విష్ణుమూర్తి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఈఈ చిరంజీవి, గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ స్పందన రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 2వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

పిఎసిఎస్‌లను ప్రభుత్వం ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్, విశాఖ డెయిరీ ప్రతినిధి పిళ్లా రమాకుమారి అన్నారు. సహకార రంగంలో సంఘాలు బాగుపడాలంటే అందులో రాజకీయం చొరబడ కూడదని, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. రుణాలు ఎగ్గొట్టొచ్చు అన్న భావన రైతుల్లో కలక్కుండా చూడాలన్నారు. శనివారం కొక్కిరాపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకు 69వ మహాజనసభలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని పాలకవర్గానికి, రైతులకు పలు సూచనలు చేశారు. మహాజన సభకు అధ్యక్షత వహించిన కొక్కిరాపల్లి బ్యాంకు చైర్మన్ మళ్ల కొండబాబు మాట్లాడుతూ ఆబ్కాబ్ నుండి జిల్లా డిసిసిబిలకు అక్కడ నుంచి పిఎసిఎస్‌లకు బల్క్ రుణాలందుతాయని, రైతు బకాయి పడినట్లు, సంఘం బాకాయి పడితే రెట్టింపు వడ్డీ కట్టాల్సి రావడం మూలంగా మనలాంటి సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయని వివరించారు. 154 మంది రైతులకు రూ.1.61లక్షలు వడ్డీ రాయితీ చెక్కుల రూపంలో అందిచారు. పిఎసిఎస్ ఆవరణలో కీర్తిశేషులు ఆడారి తులసీరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవిందరావు, మాజీ ఎంపిపి బొద్దపు ఎర్రయ్యదొర, దాసరి కుమార్, బెజవాడ నాగేశ్వరరావు, ఈశ్వరగుప్తా, మాజీ అధ్యక్షుడు దాడి కృష్ణ, కొఠారి కొండబాబు, పిళ్లా త్రినాధరావు, కర్రి జయలక్ష్మి, పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని అనకాపల్లి డిపిఓ శిరీష రాణి తెలిపారు. శనివారం మండలంలోని దిబ్బిడి జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను ఆమె పరిశీలించారు. 64 ఇళ్లకు గాను 48 ఇల్లు నిర్మాణంలో ఉన్నాయని ఇంజనీరింగ్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె. విజయ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర జిల్లా క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టెన్నికాయిట్ క్రీడకు ఎంపికైన వారిలో యు.అబినాష్ అండర్-14, జె. ప్రదీప్ అండర్-17, జి. రాకేష్ భార్గవ్, అండర్-19కు ఎంపిక కాగా, బాల్ బ్యాడ్మింటన్‌లో అండర్-19కు కె. జగదీష్, త్రో బాల్ అండర్-19కు ఎన్ గణేష్, టి.నవీన్‌లు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పిడి సీఎల్ఎన్ ప్రసాద్, పిఈటీ వి.సూర్యనారాయణను అభినందించారు.

3న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-చోడవరం: చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిచుచునట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రూప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మిగిలిన సీట్లు భర్తీ కోసం 3న ఉదయం 9.30 గంటలకు విద్యార్థులు చోడవరం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలని కోరారు. పాలీసెట్ -2023 రాసి సీటు రాని వారు, సీటు వచ్చి కళాశాలో చేరని వారు, పదోతరగతి పాస్ అయ్యి పాలీసెట్ రాయని వారు, స్పాట్ అడ్మిషన్లు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లుకు వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. సీటు పొందిన వారు మొత్తం ఫీజును తక్షణమే చెల్లించాల్సి ఉంటుందని, ఎటువంటి ఉపకార వేతనం రాదని, మూడేళ్ళ పూర్తి ఫీజును చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర కళాశాలలో ఇది వరకే ప్రవేశం పొందిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం లేదని, వివరాలకు 8367777635 సంప్రదించాలని సుంచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యలమంచిలి : విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన ఏర్పర్చుకోవడం అవసరమని యలమంచిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక కొత్తపేట హైస్కూల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జిల్లా లోకాయుక్త, మండల న్యాయ సేవా అధికార సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులకు అవసరమైన న్యాయ అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, పాఠశాలలో ర్యాగింగ్‌లపై ప్రాథమిక అంశాలను ప్రస్తావిస్తూ వాటిని అవగాహన చేసుకొని విద్యార్థులు తమ ప్రవర్తనకు అన్వయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరిశంకర్, సుభాషిణి, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

అనకాపల్లి మండలం తుమ్మపాల సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పటాన్‌శెట్టితో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ నీటిపారుదల అభివృద్ధి చైర్మన్ డి. దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ బి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం దాలివలస, దేవరాపల్లి మండలం ఎం.అలమండలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో కె.కోటపాడు జెడ్‌పిటిసి అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, అలమండ మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శంకర్రావు, ఎంపీటీసీ పోతల వెంకటరావు అధికారులు పాల్గొన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెద్దపల్లి అర్బన్ పిహెచ్‌సిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలన్ని ప్రారంభించారు. ఎంపిపి బోదెపు గోవింద్ పాల్గొన్నారు. మునగపాక సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు పాల్గొని ప్రసంగించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ళ జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ పాల్గొన్నారు. పరవాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు ప్రారంభించారు. కశింకోట మండలం జమౌదులపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి మండలంలోని వేంపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఎంపీపీ రత్నం, సర్పంచ్ నూకరత్నం పాల్గొన్నారు. కోటవురట్ల మండలంలో తంగేడు గ్రామంలోని జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. రోలుగుంట మండలం జానకిరామపురం గ్రామంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన, గొలుగొండ పిహెచ్‌సి పరిధిలో పుత్తడిగైరంపేటలో సర్పంచ్ పత్తి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కెకె.రాజు

జివిఎంసి పరిధి సీతమ్మధారలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఇంటి వద్ద ఆయనకు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుకు ఎఎన్ఎం, ఆశా వర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. పెందుర్తి మండలం రాంపురంలో ఎమ్మెల్యే అదీప్‌రాజు ఆధ్వర్యాన వైద్య పరీక్షలు నిర్వహించారు. మధురవాడ పిహెచ్‌సి వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, డిఎం అండ్ హెచ్ఓ జగదీశ్వరరావు పాల్గొన్నారు. గాజువాక పిహెచ్‌సిలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యాన వైద్య పరీక్షలు జరిపారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, సిడిఎంఎ ఆఫీసర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆనందపురం గ్రామంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన 581 మందికి, వైద్యులు పరీక్షలు నిర్వహించారు. పద్మనాభం మండలం కొవ్వాడలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు.

రైతుల గొంతునొక్కి మహాజన సభ జరిపారు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

చోడవరం చక్కెర కార్మగారం ఆవరణలో సెప్టెంబర్ 29న జరిగిన మహాజనసభ అప్రజాస్వామికంగా, రైతులు గొంతునొక్కి జరిపారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చోడవరం సుగర్స్‌ను స్వలాభం కోసం పాలక వర్గాలు పూర్తిగా నాశనం చేశాయన్నారు. మహాజన సభలో రైతులు తమ కష్టాలను చేప్పుకోవచ్చని ఆశతో రాగా, వారికి తీవ్ర నిరాశ మిగిలిందని పేర్కొన్నారు. అప్రజాస్వామిక పద్ధతిలో, పోలీసులు నిఘా నీడలో మహాజనసభ జరపడం అత్యంత దుర్మార్గమన్నారు. సుగర్ ఫ్యాక్టరీ పాలకవర్గం, అధికార పార్టీ సొత్తుకాదని, వేలాది మంది రైతులు షేర్ల, కష్టార్జితంతో నడుస్తుందని గుర్తు చేశారు. అటువంటిది రైతులను మాట్లాడివ్వకుండా అధికార పార్టీ మీటింగ్‌లాగ జరపడం దారుణమన్నారు. ఫ్యాక్టరీ పరిధిలో ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వ విప్ ఉన్నా ఇక్కడి రైతంగాన్ని ఆదుకోవడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. 25 వేల కుటుంబాలకు ఆధారంగా ఉన్న ఫ్యాక్టరీ మనుగడ నేడు దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందన్నారు. రైతులకు సుమారు రూ.9 కోట్లు బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు రూ.3 కోట్లు వరకు ఉన్నాయని, వీటిని పూర్తిగా చెల్లించి మహాజనసభ జరపాల్సి ఉండగా, ఒక తంతుగా జరిపించారని విమర్శించారు. దీనికి అధికార పార్టీ నాయకులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని వెంకన్న హెచ్చరించారు.

మహాజనసభలో డిప్యూటీ సిఎం వైఖరి అభ్యంతరకరం

ప్రజాశక్తి-అనకాపల్లి

చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు అన్నారు. అనకాపల్లిలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాజనసభలో జనసేన పార్టీ రైతుల పక్షాన పలు సమస్యలు తెలియచేసి వాటికి పరిష్కారం గూర్చి మాట్లాడితే, డిప్యూటీ సిఎం దానిని విమర్శిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తమ బాధల్ని చెప్పుకోవడానికి ప్రయత్నించిన రైతుల్ని పోలీసు సిబ్బందిని పిలిచి బయటికి పంపించండని హుకుం జారీ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రూ.3,100 మద్దతు ధర ఇస్తామని 2018లో జనరల్ బాడీ మీటింగ్‌లో బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ చెప్పారని, ఈ నాలుగేళ్లలో ఎందుకు దానిని అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇథనాల్ ప్లాంట్ ఇంకా డిపిఆర్‌లో ఉందని అదే వేదిక నుండి సాక్షాత్తు అనకాపల్లి కలెక్టర్ చెప్పగా, ప్లాంట్ నెలకొల్పడానికి పర్యావరణ అనుమతులు వచ్చాయని డిప్యూటీ సిఎం ఎందుకు అబద్ధం చెప్పారని ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నాయకులు గూనూరు సూర్యనారాయణ, బలిజ మహారాజు, మైచర్ల నాయుడు, డిఎస్ నాయుడు, కర్రి రమేష్, పరవాడ దొరబాబు, దూలం గోపి, శ్రీరామదాసు గోవింద, భరణికాన రాము, మల్ల శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా పని చేయాలని పార్టీ మండల అధ్యక్షులకు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానికంగా ఉన్న తన క్యాంప్ ఆఫీసులో శనివారం జిల్లాలో నూతనంగా నియమితులైన వైసిపి మండల అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు మీపై ఉన్న నమ్మకంతో మండల పార్టీ పగ్గాలు అప్పగించారని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల కాలంలో చేసిన మేలును ప్రతి కుటుంబానికి వివరించాలని సూచించారు.

ఈ-పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసంఘటిత రంగాల కార్మికులు, వలస కార్మికులు ఈ- శ్రమ్ పోర్టల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ కార్మిక కమిషనర్ బుద్ధ మునిస్వామి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా ఉచితంగా యూనివర్సల్ అకౌంట్ నెంబర్, గుర్తింపు కార్డు జనరేట్ అవుతాయని తెలిపారు. వలస కార్మికులకు రేషన్ కార్డు, ఇతర సమస్యలు ఉంటే కార్మిక శాఖను సంప్రదించాలన్నారు. ప్రధానమంత్రి యోగి మాన్ధాన్ పథకం ద్వారా పింఛన్ సౌకర్యం లభిస్తుందన్నారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి : సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలతో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్చార్జి ఏడిఆర్ డాక్టర్ రమణమూర్తి పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ అధికారులతో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 81,992 హెక్టార్లకు గాను 51,494 హెక్టార్లలో 63 శాతం పంట సాగు జరిగిందని తెలిపారు. మిగిలిన విస్తీర్ణంలో రబీకి అనుకూలమైన వరి, మొక్కజొన్న మినుము పెసర, ఉలవలు బొబ్బర్లు జనుము వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి పి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంత వరకు సాధారణ విస్తీర్ణంలో 78 శాతం వరి, 21 శాతం అపరాలు, 27 శాతం నూనె గింజలు, 33 శాతం వాణిజ్య పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, కీటక శాస్త్రవేత్త డాక్టర్ విశాలాక్షి, శాస్త్రవేత్తలు రామలక్ష్మి, సరిత, ఉమామహేశ్వరరావు, ఎంబీజీఎస్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-చోడవరం : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛత అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మౌల్యాద్రి, అధ్యాపకులు పిచ్చమ్మ, రత్న భారతి, సత్యవతి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కశింకోట : ఆరోగ్యానికి యోగా మేలు చేస్తుందని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య అధికారి లావణ్య అన్నారు. కన్నూరుపాలెం గ్రామంలో శనివారం యోగా, ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం అయర్వేద లేహ్యం పంపిణీ చేశారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం డివిజన్‌లో చోద్యం కోఆపరేటివ్ సొసైటీ రుణాల మంజూరు, రికవరీలో ముందంజలో ఉందని సొసైటీ ఛైర్మన్ కిలపర్తి పెద్దిరాజు అన్నారు. గొలుగొండలో శనివారం సొసైటీ భవనంలో ప్రొఫెషనల్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుణాలు మంజూరులో పారదర్శకత కోసం రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రొఫెషనల్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ , పశుసంవర్ధక శాఖ నుంచి ఒక్కొక్క ప్రతినిధి రైతుల నుండి ఇద్దరు ప్రతినిధులతో ఈ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. చోద్యం సొసైటీ నుంచి ఇప్పటివరకు సుమారు 40 మంది రైతులకు మూడు కోట్ల రూపాయల వరకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు సొసైటీలో 10 శాతం బకాయి ఉన్నప్పటికీ రైతులకు రుణాలు అందజేసేవారమని, ఇప్పటినుండి ఐదు శాతం బకాయి కన్నా తక్కువ ఉంటేనే రుణాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు. ఇప్పటికే బకాయి ఉన్న రైతులందరికీ నోటీసులు పంపించామని ఆయన తెలిపారు. బకాయి రైతులంతా వెంటనే రుణాలు చెల్లిస్తే కొత్తవి ఇవ్వడానికి అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సెక్రటరీ రాజు, త్రిసభ్య కమిటీ సభ్యులు కసవరాజు పోతురాజు, గండం అచ్చమ్మ, ప్రొఫెషనల్ కమిటీ సభ్యులు కొల్లు అప్పలనాయుడు, జాగు రామకృష్ణ, వ్యవసాయ శాఖ ప్రతినిధి స్వర్ణలత, ఉద్యాన శాఖ ప్రతినిధి రమాభాగ్యం, పశుసంవర్ధక శాఖ నుంచి అనూష, కొమిర సర్పంచ్ అల్లు రాజబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పెద్దిరాజు

మాట్లాడుతున్న ఎస్సై నారాయణరావు

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:పౌర హక్కుల పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్సై నారాయణరావు సూచించారు. శనివారం గొలుగొండ పంచాయతీ పేటమాలపల్లిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు(బుజ్జి), సెక్రటరీ పివి.రమణ, మండల పరిషత్ కార్యాలయ ఏఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాధులను నియంత్రించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని, తక్షణమే వ్యాధులను నియంత్రించాలని జనసేన పార్టీ మండల సీనియర్ నాయకులు రేగుబళ్ల సాంబశివ, మండల పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ, డ్రైనేజీ కాలువల్లో ఉన్న మురుగు పేరుకుపోయి దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రజలు ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. జగనన్న సురక్ష పేరుతో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపు కుంటున్నారని ఆరోపించారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నర్సీపట్నం మండలం యరకన్నపాలెం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విలేజ్ క్లినిక్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, ఎంపిడిఒ జయమాధవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఆటలలో విశేష ప్రతిభ కనబరచి ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె శ్రీనువాసరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ,అండర్ 17 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పుట్ బాల్ పోటీలు జరిగాయన్నారు. ఈ విభాగంలో రాయవరం పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు కె.కావ్య, పి.జానకీలక్ష్మి, ఏ భార్గవి, బి.భార్గవి, బాలుర విభాగంలో కె.ఫణీంద్ర ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ 17వ వార్డ్‌కు చెందిన గుడాల శివ వాలంటీర్‌గా పని చేస్తూ కరోనాతో మృతి చెందటంతో బాధిత కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి 5లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ గుదిబండి నాగేశ్వరావు, జిఎన్ఆర్ ఛైర్మన్ గుడబండి ఆదిలక్ష్మి, మునిసిపల్ ఛైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ ప్రెసిడెంట్ ఏకశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన టిడిపి నిరసనలు

ఎస్.రాయవంలో నిరసన చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి-కోటవురట్ల: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం సాయంత్రం టిడిపి నాయకులు మండల కేంద్రం ప్రధాన కూడలి వద్ద వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. వాహనాల హారర్ మోగిస్తూ, విజిల్స్ వేస్తూ నిరసన చేపటాటరు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, కసిరెడ్డి ఏసు సుంకర బాబ్జి, పిరపాత్రుని బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ శనివారం రాత్రి మండలంలో పలుచోట్ల టిడిపి శ్రేణులు మోత మోగిద్దాం కార్యక్రమం చేపట్టారు.దోసలపాడు నుండి ముకుందరాజుపేట వరకు టిడిపి శ్రేణులు ర్యాలీ చేపట్టి కంచాలు, గంటలు మోగిస్తూ ,బూరలు ఊదుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు .

ఎస్.రాయవరం: తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు కు నిరసనగా మోత మోగిద్దాం కార్యక్రమం నిర్వహించామని మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం తెలిపారు.మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు

పలుచోట్ల ర్యాలీలు

విగ్రహం వద్ద నుండి వైయస్సార్ విగ్రహం వరకు విజిల్స్ వేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. సర్వసిద్ధి గ్రామంలో మాజీ సర్పంచ్ పడమటి సతీష్ ఆధ్వర్యంలో మోత మోగిదాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోన రామ్మోహన్‌రావు, బత్తుల వాసు, శిల్పశెట్టి కృష్ణ, మాడగల బుజ్జి, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండుబోగుల గోవిందరావు, వైస్ ప్రెసిడెంట్ చలమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక పరమేశ్వరి పార్క్ జంక్షన్లో తెలుగుదేశం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వర రావు ఆధ్వర్యంలో పళ్లెం, గరిట, విజిల్స్, డ్రమ్ములతో మోత మోగించారు. కార్యక్రమంలో కుప్పిలి జగన్, బోడి వెంకట్రావు, గుడాల సత్యనారాయణ, పొలిమేర నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మోత మోగిస్తాం కార్యక్రమాన్ని శనివారం రాత్రి 7 గంటలకు ప్రారంభించారు. గరిటెలతో కంచాలను వాయిస్తూ, వాహనాల హారన్లను మోగిస్తూ అన్ని గ్రామాల్లోనూ నిరసన వ్యక్తం చేశారు. రాజాం, దిబిడి తదితర గ్రామాల్లో మోటార్ వాహనాలతో ర్యాలీ నిర్వహించి హారన్‌లు వాయిస్తూ నిరసనలు తెలిపారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యాన రామాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ కంచాలు, డప్పులు, కారు హారన్‌తో మోత మోగించి నిరసన తెలిపారు. నాయకులు చల్ల నానాజీ, గొర్రె దేవుళ్ళు, బండారు అప్పలనాయుడు, కొల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు నాయకత్వంలో సీబీఎన్‌తో నేను ప్లకార్డులు పట్టుకొని ప్రచారం చేశారు. నాయకులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మారిశెట్టి శంకర్రావు దాడి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ దక్షిణ నియోజకవర్గం 33వ వార్డు నీలమ్మ వేపచెట్టు, బంగారమ్మ మెట్ట పరిసర ప్రాంతాలలో 'మేము సైతం బాబుతో' ఇంటింటి కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మాట్లాడారు. పార్టీ వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి మధుపాడ ధనలక్ష్మి ,వార్డు మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి పాల్గొన్నారు. ఆర్‌కె బీచ్ కాళీమాత గుడి ఎదురుగా ఉన్న తీరంలో మహిళలు మోకాళ్ల లోతులో నిలబడి జల దీక్ష కార్యక్రమం నిర్వహించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి విల్లూరి తిరుమలదేవి, నాయకులు సింగంపల్లి మాధవి, గంద సత్య పాల్గొన్నారు.

తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. టిడిపి కార్యాలయంలో నిరసన దీక్ష చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్‌కు శుక్రవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు.

పిఎంపాలెం:టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన పిఎం పాలెం రెండవ బస్ స్టాప్ వద్ద డప్పులు, విజిల్స్ ద్వారా మోత మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, గిరి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆనందపురం:మండలం వేములవలస కూడలిలో ద్విచక్ర వాహనాల సముదాయంతో హారన్ మోగిస్తూ, విజిల్స్ వేస్తూ మోత మోగించారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజబాబు, మీసాల సత్యనారాయణ, గుండు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారాన్ని అందజేస్తున్న దాతలు

ఆలయానికి బంగారం వితరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని గోకులపాడు నూకాలమ్మ తల్లి ఆలయానికి గ్రామస్థుడు ఐదు గ్రాముల బంగారం అందజేసినట్లు నూకాంబికా కమిటీ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు. గోకులపాడు విశాఖ డైరీ పెయిడ్ సెక్రటరీ శానాపతి రమణ బంగారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్కా శ్రీనివాసు, సమ్మింగి నానాజీ పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొటాన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు చేస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి గెలిచిన తరువాత విస్మరించారని మండిపడ్డారు. 2013 జులై నుంచి ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇంతవరకూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. 117 జిఒను తక్షణం రద్దు చేసి విద్యారంగంలో జరిగిన నష్టాన్ని వెంటనే పూరించాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ 3, 4 తరగతుల పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్. పెద్దినాయుడు, దేవుడుబాబు, సత్యనారాయణ, రాజన్న, మంగమ్మ, ఎన్.విజయ పాల్గొన్నారు.

ధర్నా చేపడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఆసుపత్రి ప్రాంగణంలో జెసిబితో చేపడుతున్న పనులు

హెటిరో ఆధ్వర్యాన పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక 50 పడకల ఆసుపత్రిలో హెటిరో ఆధ్వర్యాన శనివారం శ్రమదానం చేపట్టారు. కంపెనీ ప్రతినిధులు ఎస్.కుళ్ళాయిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, సిఎస్ఆర్ స్టాఫ్ ఎం.సుధాకర్, అరుణ్ కుమార్ రెడ్డి, కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది కలిసి శ్రమదానం చేపట్టారు. గడ్డి, పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.ఆసుపత్రి బయట, లోపల ఆవరణమంతా పరిశుభ్రత చేశారు.ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటేందుకు జెసిబితో మట్టిని చదును చేయించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లేపాక్షి ఎమ్‌డి లక్ష్మీనారాయణ

కళాకారులు నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:హస్త కళాకారులు వృత్తి పట్ల నైపుణ్యత పెంపొందించుకోవాలని లేపాక్షి ఎండి లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన కైలాసపట్నం గ్రామంలో హస్తకళలపై ముగిసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జడ్పిటిసి సభ్యులు ఉమాదేవి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, ఎంపిటిసి సభ్యులు వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు సత్తిబాబు, పలువురు హస్త కళాకారులు పాల్గొన్నారు.

అప్పారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భారత సైన్యంలో పని చేసి పదవీ విరమణ పొందిన సెక్యూరిటీ ఆఫీసర్ రాజాన అప్పారావును పెద్దబొడ్డేపల్లిలో ఘనంగా సన్మానించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు సరమండ వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజాన అప్పారావుకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బిఎస్పి నియోజకవర్గం ఇంచార్జ్ బొట్టా నాగరాజు మాట్లాడుతూ, నర్సీపట్నంలో రిక్షా పుల్లర్స్ సంఘం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున అప్పారావు పోరాటాలు చేశారన్నారు. ఈ సందర్భంగా రాజాన అప్పారావు మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో మనం అడుగులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ఎం.చిట్టియ్య, బహుజన ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో సోమవారం అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా తానుబెల్లి ఫౌండేషన్, రోటరీ క్లబ్ (నర్సీపట్నం) ఆధ్వర్యంలో స్థానిక శ్రీ శాంతి ఆటో యూనియన్, పలువురు యూత్ సేవా సంఘాల సహకారంతో మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పిఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, కొత్తకోట ఎస్ ఐ విభీషణరావు, రోలుగుంట ఎస్ఐ నాగ కార్తీక్ ల చేతుల మీదుగా గోడ పత్రికను విడుదల చేశారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ, రక్తదానం ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా భావించాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కూడా రక్తదానం చేయవచ్చునని తెలిపారు.

మున్సిపాలిటీలో సమస్యలపై ధ్వజం

-టిడిపి సభ్యులు బహిష్కరణ

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

సమస్యలు తెలియజేస్తున్న కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక పురపాలక సంఘం సాధారణ సమావేశం పురపాలక సంఘం కార్యాలయంలో చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేశారనే ఉద్దేశంతో సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిసింది. అజెండా కాపీని చదివి వినిపించిన అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మునిసిపాలిటీలోని సమస్యల పై ప్రశ్నించారు. పురపాలక సంఘంలో పారిశుధ్యం ఎందుకు సరిగా జరగలేదని లోపాలు ఎక్కడ ఉన్నాయని సిబ్బందిని నిలదీశారు. శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు సమాధానం ఇస్తూ, పనిముట్లు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, దీంతో, పారిశుధ్యానికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. కౌన్సిలర్ బుల్లిదొర మాట్లాడుతూ, పట్టణంలో చనిపోయిన గొర్రెలు, మేకలు అమ్మకాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోలేదని, కుళ్ళిన మాంసాలతో ప్రజలు అనారోగ్యం పాలవు తారన్నారు. పట్టణంలో పారిశుధ్య లోపంతో దోమలు బెడద చాలా ఎక్కువగా ఉందని, వీటిని అరికట్టడానికి ఫాగింగ్ మిషన్ మరమ్మతు చేయించాలన్నారు. మహిళా కౌన్సిలర్ శెట్టి విజయాంబ దోమల నివారణకు సభ దృష్టికి తీసుకువచ్చారు. చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని పనిముట్లు కూడా రప్పిస్తున్నామన్నారు.ఈ సమావేశంలో డిఇ నారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, ఆర్ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు చైతన్య దీపిక కూచిపూడి రంగ ప్రవేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శ్రీ విశ్వ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురునేమాని విశ్వశాంతి సారథ్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వేద చైతన్య దీపిక కూచిపూడి రంగ ప్రవేశం చేయనున్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో గురునేమాని విశ్వశాంతి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ హాజరవుతున్నట్లు చెప్పారు. అలాగే ఎస్‌పి.రాధిక, హరిరామమూర్తి గౌరవ అతిథులుగా పాల్గొంటున్నట్లు వెల్లడించారు. తమ విద్యార్థి చైతన్య దీపిక తన అద్భుత కూచిపూడి కళా ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తపరిచారు.

ఐక్యతతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజలకు బంగారు భవిష్యత్తు కావాలనుకుంటే బహుజనులు అందరూ ఐక్యంగా కలిసి ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల మహాసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కొంగర అనిల్ కుమార్ అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరినీ ఐక్యంచేసి ఏకతాటిగా నడిపించడమే తమ లక్ష్యమన్నారు. దేశ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు రాచపల్లి ధర్మేంద్ర, ఎపి రాష్ట్ర అధ్యక్షుడు మేడి శివ, నాయకులు దామెర కరుణ, చెంగల చిన్నారావు, చింతాడ సూర్యం, గండి రాజేశ్వరి పాల్గొన్నారు.

910వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 910వ రోజుకు చేరాయి. దీక్షల్లో మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో జయమ్మ, భూషణం, కె.రత్నం, సింహాచలం, వి.నీలవేణి, ఎ.పావని, సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న మహిళలు

'నవజీవన్'కు అవార్డు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బ్రిడ్జ్ స్టోన్ ఇండియాస్ మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డ్స్ 2023ను తిరుపతికి చెందిన నవజీవన్ ఆర్గనైజేషన్ దక్కించుకుందని బ్రిడ్జ్ స్టోన్ ఇండియా ఎమ్‌డి స్టెపానో తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ అవార్డుల మూడో ఎడిషన్ ప్రదానోత్సవం పూణేలో నిర్వహించారన్నారు. మూడు విభాగాలలో ఈ అవార్డుల కింద మొత్తం రూ.30 లక్షల నగదు బహుమతిని అందించారన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జి.మాడుగుల: పెదలువ్వాసింగి పంచా యితీ చిలకలపాలెం నుండి ఎస్లాలు గ్రామం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర 80 లక్షల తో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు శనివారం స్థానిక వైసిపి నాయకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సుమారు 20 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. రహదారి సౌకర్యాలు లేని పడిన ఇబ్బందులు తొలగి పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు